క్లుప్తంగా

సాంకేతికత వైపు అడుగులు వేయండి

మాజీ ఎంపీ తూళ్ల దేవేందర్‌గౌడ్



విద్యార్థుల నృత్య ప్రదర్శన

తుక్కుగూడ: విద్యార్థులు కష్టపడి చదివి, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మాజీ ఎంపీ తూళ్ల దేవేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం దేవేంద్ర విద్యాలయ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు బట్టీ విధానానికి స్వస్తి చెప్పి.. సాంకేతిక విద్య వైపు అడుగులు వేయాలని సూచించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆగాఖాన్ అకాడమీ డీన్ అర్జున్‌పూరి, బయోమ్యాక్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీ చైర్మన్ రవీందర్‌గౌడ్, శ్యామ్ ప్రసాద్, సత్యనారాయణ, పాఠశాల డైరెక్టర్ తూళ్ల విజయేందర్‌గౌడ్, కరస్పాండెంట్ తూళ్ల శేత్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వార్డు సమస్యల పరిష్కారానికి కృషి

తుక్కుగూడ: వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని బీజేపీ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ శివకుమార్ చెప్పారు. బుధవారం రావిర్యాల గ్రామంలో 4వ వార్డులో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించి మాట్లాడారు. కొద్ది రోజుల నుంచి ఇక్కడ విద్యుత్ సమస్య ఉండటంతో కొత్తగా స్తంభాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నారాయణపురం బస్సు సర్వీస్ పునఃప్రారంభం

మంచాల: బండలేమూర్–నారాయణపురం ఆర్టీసీ బస్సు సర్వీసును ఎట్టకేలకు బుధవారం పునఃప్రారంభించారు. ఐదేళ్ల క్రితం ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో నుంచి బండలేమూర్ మీదుగా యాదాద్రి జిల్లా నారాయణపూర్ మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సు నడిచేది. ఈ బస్సు రెండు జిల్లాలోని సరిహద్దు గ్రామాల మీదుగా రాకపోకలు సాగించేది. అప్పట్లో డిపో మొత్తంలో అధిక ఆదాయం తీసుకొచ్చే బస్సు సర్వీస్ కూడా ఇదే. మూడేళ్ల క్రితం వర్షాల కారణంగా ఈ మార్గంలోని రోడ్డు పాడై పోవడంతో బస్సు సర్వీస్‌ను బంద్ చేశారు. దీనికి కరోనా కూడా తోడవ్వడంతో ప్రజలు కూడా తిరిగి బస్సు గురించి పెద్దగా పట్టించుకోలేదు. 20 రోజుల క్రితం బండలేమూర్ గ్రామస్తులు రాష్ట్ర ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను కలిసి ఈ రూట్లో బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని కోరారు. సజ్జనార్ ఆదేశాల మేరకు ఆర్టీసీ అధికారులు తాజాగా తిరిగి బస్సును పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా బండలేమూర్ గ్రామస్తులు బస్సుకు ప్రత్యేక పూజలు చేశారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని నిలిపివేయండి

ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి బీఎస్పీ నేతల వినతి



ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో నిర్మించతలపెట్టిన డా.బీఆర్ అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రానికి కేటాయించిన స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని నిలిపివేయాలని బీఎస్పీ నేతలు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఎస్పీ నేతలు మాట్లాడుతూ.. డా.బీఆర్ అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రానికి 10 గుంటల భూమి కేటాయిస్తే 1987 నుంచి ఆక్రమణలకు గురౌతూ నిర్మాణాలు జరిగాయని వీటిని తొలగించాలని కోరారు. అదేవిధంగా ఇప్పుడు మిగిలిన 400 గజాల స్థలంలో ప్రస్తుతం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారని.. ఈ పనులను నిలిపివేసి అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రాన్ని మాత్రమే నిర్మించాలని విన్నవించారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో రఘుపతి, రాములు, కిష్టన్న, దాసు, కృష్ణ, మహేందర్ ఉన్నారు.

పంచాయతీ రికార్డుల పరిశీలన

యాచారం: మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో బుధవారం ఎంపీడీఓ విజయలక్ష్మి పర్యటించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు, ఖర్చు వివరాల నమోదు రికార్డులను పరిశీలించారు. అదే విధంగా పన్నుల వసూలు, పంచాయతీ సిబ్బంది జీతాల చెల్లింపుల రికార్డులను పరిశీలించారు. అనంతరం పల్లె ప్రగతి పనులను, నర్సరీని సందర్శించారు. మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

మెయిన్‌రోడ్డు జిగేల్

- బడంగ్‌పేట ప్రధాన రహదారిపై హైమాస్టు లైట్ల ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు, వాహనదారులు

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కమాన్ నుంచి జిల్లా లైబ్రరీ వరకు కిలోమీటర్ల మేరా ప్రధాన రహదారిపై హైమాస్టు లైట్ల వెలుగులపై వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ రోడ్డులో రాత్రి సమయంలో వెళ్లాలంటే వాహనదారులకు ఇబ్బందిగా ఉండేది. చీకట్లో ప్రయాణం మంచిది కాదని కుటుంబ సభ్యులు అడ్డు చెప్పడంతో ప్రయాణాలు మానుకున్న సందర్భాలు కూడా ఉన్నాయని పలువురు చెబుతున్నారు. బడంగ్‌పేట టూ నాదర్‌గుల్ వెళ్లే ప్రధాన రహదారిని ఏడాది క్రితం విస్తరణ చేసే పనిలో ప్రభుత్వం సిద్ధమైంది. అందుకు గతంలో ఉన్న 22 ఫీట్ల ఆర్‌అండ్‌బీ రోడ్డును వంద ఫీట్ల వెడల్పు చేసే పనిలో నిమగ్నమయ్యారు. అందులో భాగంగానే రోడ్లను సుందరంగా తీర్చిదిద్దారు. రోడ్డు మధ్యలో డివైడర్లను ఏర్పాటు చేసి నగరంలోని ప్రధాన రోడ్ల మాదిరిగానే అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. అనుకున్నట్లుగానే రోడ్లను అభివృద్ధి చేసి మధ్యలో డివైడర్లను వేసిన మాదిరిగానే రోడ్డుకు అటుఇటుగా వెలుతురులు వచ్చే విధంగా హైమాస్టు లైట్ల స్తంభాలను ఏర్పాటు చేశారు. వాటికి పవర్ సరఫరా చేసి లైట్లు బిగించడంతో పగలే వెన్నెలగా రోడ్లు మారిపోయాయి. ఇందు



బడంగ్‌పేట నుంచి నాదర్‌గుల్ వెళ్లే ప్రధాన రహదారిపై వెలుగుతున్న హైమాస్టు లైట్లు

కోసం ప్రభుత్వం రూ. 50 లక్షలను వెచ్చించింది. బాటసారులు, పెరిగిన రద్దీ, వాహనాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుండటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

> **మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవతోనే..**
>
> 
>
> రోడ్ల వెడల్పును ఎవరూ పట్టించుకోకపోవడంతో మంత్రి సబితారెడ్డి కల్పించుకున్నారు. కోట్లు వెచ్చి రోడ్లు వెడల్పుతో పాటు డివైడర్లను ఏర్పాటు చేసి అతిపెద్ద లైట్లను ఫిటింగ్ చేయించారు. ప్రజలు సాఫీగా ప్రయాణం చేస్తున్నారు. చాలా ఆనందంగా ఉంది. అభివృద్ధికి సహకరిస్తున్న అధికారులకు, ప్రజలకు, మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.
>
> – రామిడి రాంరెడ్డి, బీఆర్‌ఎస్ నేత, బడంగ్‌పేట

నిరుపేదలకు ఆపన్నహస్తం సీఎంఆర్‌ఎఫ్

పహాడీషరీఫ్: సీఎం సహాయనిధి నిరుపేదలకు ఆపన్నహస్తంగా నిలుస్తుందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాంకాలనీకి చెందిన ఎ.రాములు ప్రమాదానికి గురై చికిత్స అనంతరం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. మంత్రి సిఫారసు మేరకు రూ.60 వేలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కును బుధవారం మంత్రి సబిత, బీఆర్‌ఎస్ నాయకులు దూడల శ్రీనివాస్‌గౌడ్, యంజాల అర్జున్‌ల సమక్షంలో బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎంఆర్‌ఎఫ్‌కు అందిన దరఖాస్తులను ఆలస్యం చేయకుండా వెంటనే మంజూరు చేయిస్తూ బాధితులకు బాసటగా నిలుస్తున్నామని చెప్పారు.



చెక్కు అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: బీఆర్‌ఎస్ పార్టీ అభివృద్ధికి కృషిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ జన్మదిన వేడుకలకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. పార్టీకి కార్యకర్తలే కీలకమని.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, ఉపసర్పంచ్ రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ భూతాన్ని తరిమికొడదాం



మీర్‌పేట: ప్రీతి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు అరవింద్

మీర్‌పేట: విద్యా సంస్థల్లో ర్యాగింగ్ భూతాన్ని తరిమికొడదామని ఎస్‌ఎఫ్‌ఐ బాలాపూర్ మండల అధ్యక్షుడు దాసరి అరవింద్ పిలుపునిచ్చారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బుధవారం మీర్‌పేటలోని చల్లా లింగారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి డా.ప్రీతి చిత్రపటానికి నివాళి అర్పించారు. డా.ప్రీతి మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ర్యాగింగ్‌ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని.. తోటి విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు వేణు, భాస్కర్, సీపీఎం నాయకులు కిషోర్, పెంటయ్య, బాబు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి..

మహేశ్వరం: ప్రీతి ఆత్మహత్యకు కారణమైన నిందితులను ఉరితీయాలని ఏబీవీపీ మహేశ్వరం నగర కార్యదర్శి జమాల్‌పూర్ రాఘవేందర్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో అంబేడ్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాల వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మెడికల్ విద్యార్థి ప్రీతి ఆత్మహత్య ఘటనపైన హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. ర్యాగింగ్ విష సంస్కృతిని నిషేధించేలా ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించాలన్నారు. ర్యాగింగ్ భూతానికి బలైన ప్రీతి కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రీతి చిత్రపటానికి నివాళులర్పించి శ్యాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సాయి, వంశీ, చంటి, రామ, లక్ష్మణ్, మల్లేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



మహేశ్వరం: నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నేతలు, విద్యార్థులు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్

మహేశ్వరం: అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అలువాల రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఐసీడీఎస్ మహేశ్వరం ప్రాజెక్టు ఎదుట అంగన్‌వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. ఎండాకాలంలో ప్రభుత్వ పాఠశాలల వలే అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలన్నారు. జీఓ 14, 19, 8లను వెంటనే సవరించాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ ఉద్యోగికి ఆసరా, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే కార్యక్రమాలకు ఇచ్చే డబ్బులు రూ.250 నుంచి రూ.2000కు పెంచాలని, రేషన్ బియ్యాన్ని శుభ్రపరిచిన వాహనం ద్వారానే సరఫరా చేయాలన్నారు. ఐసీడీఎస్‌కు నష్టం కలిగించే నూతన విద్యాచట్టాన్ని రద్దుచేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ వర్తింపజేయాలన్నారు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్‌గా గుర్తించాలని, 2017 నుంచి టీఏ, డీఏలు బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ఐసీడీఎస్‌కు ప్రభుత్వం అధిక బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయడంతో పాటు అంగన్‌వాడీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలన్నారు. ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను వెంటనే రద్దుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు శేఖర్, బాల్‌రాజ్, మహేశ్వరం, కందుకూరు, తుక్కుగూడ, అమీర్‌పేట్, రాచులూర్, పాలమాకుల, నర్కుడ సెక్టార్ల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

బడంగ్‌పేట్: స్పెల్‌బీ పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది లార్డ్స్ ఒలంపియాడ్‌కు చెందిన విద్యార్థి రిషితశ్రీ. పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థిని రిషితశ్రీ ఇటీవల రవింద్రభారతి ఆడిటోరియంలో జరిగిన ఆంగ్ల పద ప్రావీణ్యంలో సత్తా చాటగా.. మెమొంటోతో పాటు నగదు, ప్రశంసా పత్రాన్ని అందుకుంది. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ అనురాధ విద్యార్థినిని బుధవారం అభినందించారు. అలాగే వైజ్ఞానిక ప్రదర్శనలో విలువైన సమాచారం ఇస్తూ.. నమూనాలను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్న విద్యార్థులను బహుమతులతో యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది

హుడాకాంప్లెక్స్: విద్యుత్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బుధవారం సరూర్‌నగర్ డివిజన్ కార్యాలయం ఎదుట తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ విద్యుత్ వేతన సవరణ జాప్యాన్ని నిరసిస్తూ విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమ కార్యాచరణ ప్రకటించిన నేపథ్యంలో 5వ రోజు ధర్నా చేపట్టామని తెలిపారు. వేతన సవరణ వెంటనే చేయాలని, లేకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో డివిజన్ ఉద్యోగులు, వివిధ అసోసియేషన్, యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు పరాభవం తప్పదు

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి

తుర్కయంజాల్: హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్ పార్టీకి రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొంపల్లి మోహన్ రెడ్డి అన్నారు. పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లో శక్తి కేంద్రం ఇన్‌చార్జి కొండ్రు పురుషోత్తం, నోముల కార్తీక్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా గోస–బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. పురపాలక సంఘం పరిధిలోని తుర్కయంజాల్, ఇంజాపూర్, మునగనూర్, తొర్రూర్‌లోని దళితులకు చెందిన భూములను లాక్కుని హెచ్ఎండీఏ వెంచర్లు చేసి డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. వారి తరఫున బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. బీఆర్‌ఎస్‌కు పరాభవం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దయానంద్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అర్జున్ రెడ్డి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ధరావత్ శ్రీనివాస్‌నాయక్, మున్సిపాలిటీ అధ్యక్షుడు తూళ్ల నర్సింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్ రెడ్డి

ప్రజా స్పందన చూసి ఓర్వలేకనే దాడులు: కాంగ్రెస్

కడ్తాల్: టీపీసీసీ చీఫ్, ఎంపీ రేవంత్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రకు ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి ఓర్వలేకనే బీఆర్‌ఎస్ నాయకులు దాడులు చేస్తున్నారని డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం కడ్తాల్‌లో ఆయన మాట్లాడుతూ.. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన సభలో రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలో.. దొంగచాటుగా బీఆర్‌ఎస్ నాయకులు దాడిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడులకు భయపడేది లేదన్నారు. మరోసారి పునరావృతమైతే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

వైద్య శిబిరానికి ఆదరణ

మాడ్గుల: కల్వకుర్తి నియోజకవర్గంలో నిరుపేదలకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని తలకొండపల్లి జెడ్పీటీసీ సభ్యుడు, ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అన్నారు. మాడ్గుల మండలంలోని ఆర్కపల్లిలో బుధవారం హైదరాబాద్ కామినేని ఆస్పత్రి సౌజన్యంతో ఉప్పల ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని ఉప్పల వెంకటేశ్ స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 249 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మండలంలోని ఇర్విన్‌లో గురువారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్‌లు జంగయ్య, గోపాల్ నాయక్, హనుమాన్‌నాయక్, ఉపసర్పంచ్ బిక్కుగౌడ్, ఎస్ఎంసీ చైర్మన్ తిరుపతయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏవీఎన్‌రెడ్డిని గెలిపించండి

తపస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి

మంచాల: ఉపాధ్యాయ సమస్యలపై పోరాడే వ్యక్తి ఏవీఎన్ రెడ్డికి ఎమ్మెల్సీ అభ్యర్థిగా మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని తపస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి పూజరి రమేష్ కోరారు. బుధవారం మండల పరిధిలోని జాపాల, చెన్నారెడ్డిగూడ, లింగంపల్లి, ఆరుట్ల ప్రభుత్వ పాఠశాలలతో పాటు నోముల బీసీ గురుకుల పాఠశాలల్లో ఏవీఎన్ రెడ్డిని గెలిపించాలని ప్రచారం చేశారు. ఆ సంఘం రాష్ట్ర నాయకులు లక్ష్మయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహ, నాయకులు సురేష్‌కుమార్, రవీందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చుక్కాపూర్‌లో పంటల పరిశీలన

తలకొండపల్లి: వ్యవసాయాధికారుల సూచనలు, సలహాల మేరకు యజమాన్య పద్ధతులు పాటించి పంటలను రక్షించుకోవాలని ఏఈఓ రాజు.. రైతులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని చుక్కాపూర్‌లో ఆయన పర్యటించారు. రాజుకుమార్, కిషన్ ప్రసాద్ నర్సింహ, వెంకటయ్య, యాదయ్య తదితర రైతులకు చెందిన వరి, మొక్కజొన్న, వేరుశనగ పంటలను పరిశీలించారు. ఎరువులు, తెగుళ్లు, దిగుబడి తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారుల సలహాలు పాటించి మంచి దిగుబడి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీనాథ్, రైతులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటా

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నర్సింహారెడ్డి

మహేశ్వరం: ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిగురింత నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నిరుపేద అయిన నడికూడ లక్ష్మమ్మ కూతురు వివాహానికి ఆర్థిక సహాయం అందజేసి మాట్లాడారు. పేదలకు ఏ కష్టమొచ్చినా ఆదుకుంటానని, ప్రజా శ్రేయస్సుకోసం నిరంతరం పాటుపడతానని ఆయన చెప్పారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ పేదల పార్టీ అని, ఆ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలో త్వరలో పర్యటించి.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, రానున్న ఎన్నికల్లో మహేశ్వరంలో గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని వెల్లడించారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి రోజులు దగ్గరపడ్డాయన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు శివ, నాగిరెడ్డిపల్లి అధ్యక్షుడు మిద్దె శశికాంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు వత్సల నారాయణ, శశికాంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



వివాహ శుభలేఖ అందుకుంటున్న నర్సింహారెడ్డి

పేద కుటుంబాలను ఆదుకుంటాం

కార్పొరేటర్ సౌందర్య

మీర్‌పేట: మీర్‌పేట ప్రశాంత్‌నగర్‌కు చెందిన జయమ్మ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న స్థానిక 35వ డివిజన్ కార్పొరేటర్ సౌందర్య.. ఆయుష్మాన్ గ్రూప్ ఆఫ్ చారిటబుల్ ట్రస్ట్ నుంచి రూ.30వేలు, తాను సొంతంగా మరో రూ.5వేల ఆర్థికసహాయాన్ని బుధవారం అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. అమ్మతో అడుగు అనే కార్యక్రమం ద్వారా పేద కుటుంబాల వివాహాలకు పుస్తెమట్టెలు, ఆపదలో ఉన్నవారికి రక్తదానం, నిరుపేదలకు ఆర్థిక సహాయం అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్ ఇంద్రావత్ రవినాయక్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కామేష్‌రెడ్డి, నేతలు.. విజయ్, రాకేష్ పాల్గొన్నారు.



జయమ్మకు ఆర్థికసాయం అందజేస్తున్న నేతలు

కార్మిక హక్కులను కాలరాస్తున్నారు

సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు కిషన్

ఇబ్రహీంపట్నం: వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించడంతో పాటు 8 గంటల పనిదినాన్ని అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు డి.కిషన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఇబ్రహీంపట్నం అసిస్టెంట్ లేబర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యూటీ, బోనస్ ఇవ్వాలన్నారు. వివిధ పరిశ్రమల్లో చట్టపరమైన హక్కులను కల్పించడంలో యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపించారు. కార్మిక శాఖ ఆదేశాలు తుంగలో తొక్కి 12 గంటలు పనిచేయించుకుంటూ యాజమాన్యాలు లాభాలు గడిస్తున్నట్లు తెలిపారు. కార్మిక హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఏఎల్ఓ ఆంజనేయులుకు సీఐటీయూ నేతలు వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం నాయకులు కవిత, ప్రతాప్, యాదగిరి, కృష్ణ, శివప్రసాద్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, శంకర్, మనోహర్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌కు అవార్డుల పంట

కడ్తాల్: సామాజిక సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతున్న లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లుకు అవార్డుల పంట పండింది. తోడేటి చెన్నారెడ్డి గార్డెన్‌లో బుధవారం జరిగిన 'విజయం రిజియన్ మీట్‌లో' లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు పలు అవార్డులను సొంతం చేసుకుంది. రీజియన్ ఎక్స్‌లెంట్ క్లబ్‌గా లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు నిలవడంతో పాటు, ఉత్తమ అధ్యక్షుడిగా ఆమనగల్లు క్లబ్ భైరి కరుణాకర్‌రెడ్డి, ఎక్స్‌లెంట్ కార్యదర్శిగా కుడుముల భాస్కర్‌రెడ్డి, ఎక్స్‌లెంట్ ట్రెజరర్‌గా కొండల్ రెడ్డి, లయన్ ఆఫ్ రీజియన్‌గా సంపత్, ఉత్తమ పీఆర్‌ఓగా ఎంఏ.పాషా అవార్డులు సొంతం చేసుకున్నారు. రీజియన్ చైర్‌పర్సన్ బావండ్ల వెంకటేశ్ చేతుల మీదుగా వారు అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రఘు, ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ హరినారాయణ, కోటేశ్వరరావు, సందడి నరేందర్‌రెడ్డి, రమేశ్‌బాబు, చెన్నకిషన్‌రెడ్డి, వెంకటస్వామి, రాంరెడ్డి, నరేశ్, వెంకటేశ్వరెడ్డి, వెంకట్‌రెడ్డి, బాలకృష్ణ, సునంద, వెంకటేశ్వర్లుగౌడ్, భాస్కర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



ఎంఏ పాషాను సన్మానిస్తున్న సభ్యులు